

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మంచుకంటి వెంకటేశ్వర్లు

## సంక్షేమ పథకాలే ఎమ్మెల్యే భగత్‌ను గెలిపిస్తాయి

- ఎంపీపీ మంచికంటి వెంకటేశ్వర్లు

గుర్రంపోడు, అక్టోబర్ 18: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే నాగార్జునసాగర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి నోముల భగత్‌ను మరోసారి ఎమ్మెల్యేగా అత్యధిక మోజార్టీతో గెలిపిస్తాయని ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కాంగ్రెస్‌కు వెళ్లింది కేవలం జడ్పీటీసీ, కొందరు సర్పంచులు మాత్రమే అని కార్యకర్తలంతా బీఆర్‌ఎస్‌లోనే ఉన్నారని పేర్కొన్నారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశం లేదన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్రంలో హ్యాట్రిక్ విజయం సాధిస్తుందన్నారు. గుర్రంపోడు మండలంలో గత ఉప ఎన్నికల కంటే అధిక మెజార్టీ బీఆర్‌ఎస్‌కు వస్తుందని దీమా వ్యక్తం చేశారు. సమావేశంలో వైస్ ఎంపీపీ వజ్జ రామేశ్వరీధనుంజయ్, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రామగిరి చంద్రశేఖర్‌రావు, నాయకులు మేకల వెంకట్‌రెడ్డి, ధైద శ్రీనివాస్ రెడ్డి, తేలుకుంట్ల కుర్మాల్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కర్న బ్రహ్మానందరెడ్డి

## సాగర్ నియోజకవర్గానికి జానారెడ్డి చేసిందేమీ లేదు

- ఎమ్మెల్యే నోముల భగత్‌తోనే అభివృద్ధి
- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు బ్రహ్మానందరెడ్డి

నందికొండ, అక్టోబర్ 18 : 30 ఏండ్లు వివిధ హోదాల్లో అధికారం అనుభవించిన మాజీ సీఎల్పీ నేత కుందూరి జానారెడ్డి నాగార్జునసాగర్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదని ఏమి లేదని, నోముల భగత్ ఎమ్మెల్యే అయ్యాకే రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 300 కోట్లుకు పైగా నిధులు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశారని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కర్న బ్రహ్మానందరెడ్డి అన్నారు. నందికొండ హిల్‌కాలనీలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ అభివృద్ధి కొనసాగాలంటే అందరూ ఏకమై బీఆర్‌ఎస్‌కే ఓటు వేసి నోముల భగత్‌ను ఎమ్మెల్యేగా మరోసారి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎవరెన్ని కుట్రలు చేసినా రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే భగత్ భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట లింగయ్య, వెంకటస్వామి, పిచ్చయ్య ఉన్నారు.

## ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలి

- ఈఆర్‌ఓ శ్రీనివాస్



సమావేశంలో పాల్గొన్న ఈఆర్‌ఓ శ్రీనివాస్, పార్టీల నాయకులు

నిడమనూరు, అక్టోబర్ 18 : ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని నాగార్జున సాగర్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె. శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 20న నియోజకవర్గానికి కేటాయించిన ఈవీఎంలను హాలియా పట్టణంలోని ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేసిన డీఆర్‌సీ కేంద్రంలో భద్రపరుస్తామన్నారు. ఈ కార్యక్రమానికి రాజకీయ పక్షాల నాయకులు విధిగా హాజరు కావాలని సూచించారు. సమావేశంలో సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జంగాల కృష్ణయ్య, రాజకీయ పార్టీల నేతలు తాటి సత్యపాల్, అంకతి సత్యం, మంద తిరుపతయ్య, చిట్టిమల్ల శ్రీనివాస్, ఎన్నికల సిబ్బంది మల్లిఖార్జున్ రావు, రాజిరెడ్డి, వంశీ పాల్గొన్నారు.

# సర్కారు చొరవతో తీరనున్న దశాబ్దాల కల

- నిడమనూరు-చింతగూడెం రోడ్డుకు మోక్షం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



బీటీగా మారనున్న నిడమనూరు-చింతగూడెం రోడ్డు

నిడమనూరు, అక్టోబర్ 18 : నాలుగు దశాబ్దాలుగా పలు గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులు బీఆర్‌ఎస్ ప్రభుత్వ సహకారంతో తీరనున్నాయి. నిడమనూరు నుంచి చింతగూడెం వరకు రోడ్డు నిర్మాణానికి నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.4.35 కోట్లు విడుదల చేసింది. దాంతో పాటు ఇటీవలే ఎమ్మెల్యే రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన కూడా చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### 6 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు

ప్రత్యేక అభివృద్ధి నిధులు రూ.4.35 కోట్లతో ఆరు కిలోమీటర్ల మేర తారు రోడ్డు నిర్మించనున్నారు. నిడమనూరు మండల కేంద్రం నుంచి ఊట్కూరు, ముప్పారం, అనుముల మండలంలోని పాలెం, చింతగూడెం, ఇబ్రహీంపేట గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు నిత్యం ఈ రోడ్డు పైనుంచే ప్రయాణిస్తుంటారు. ఇప్పటి వరకు సరైన రోడ్డు సౌకర్యం లేక పోవడంతో ప్రజలు నరకయాతన పడుతున్నారు. గత పాలకులు రహదారి నిర్మాణాన్ని ఎన్నికల హామీలకే పరిమితం చేయడంతో ఏండ్లుగా ప్రజలు రోడ్డు కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ చొరవతో రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఆరు కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణంతో ఆయా గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగడంతో పాటు జిల్లా కేంద్రానికి సుమారు 8 కిలో మీటర్ల దూరం తగ్గనుంది. ప్రస్తుతం అలీనగర్ మీదుగా నల్లగొండకు వెళ్లేందుకు 35 కిలో మీటర్లు ప్రయాణించాల్సి వస్తున్నది. నిడమనూరు- చింతగూడెం రోడ్డు నిర్మాణం పూర్తయితే దూరాభారం తగ్గనున్నది.



ఇటీవల ఎమ్మెలే నోముల భగత్ ఆవిష్కరించిన శిలాఫలకం

### రైతులకూ సౌకర్యవంతం

నిడమనూరు, అనుముల మండలాల్లోని సరిహద్దు గ్రామాలకు నిమిషాల వ్యవధిలో చేరుకునేందుకు నిడమనూరు-చింతగూడెం రోడ్డు దోహదం చేయనుంది. మండల కేంద్రంతో పాటు గుంటుకగూడెం, ముప్పారం, ఊట్కూరు, అనుముల మండలంలోని పాలెం, అలీనగర్, చింతగూడెం శివారులోని సరిహద్దు వ్యవసాయ భూములకు వెళ్లేందుకు వీలు కలుగుతుంది. ఈ రోడ్డు పనులు త్వరలోనే ప్రారంభం కానుండడంతో ఆయా గ్రామాల ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ ఇబ్బందులు తీర్చిన రాష్ట్ర ప్రభుత్వానికి, ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



హమాలీలకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

## సత్యనారాయణపురంలో వైద్య శిబిరం

త్రిపురారం, అక్టోబర్ 18 : మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సత్యనారాయణపురం గ్రామంలో ఉన్న రైస్‌మిల్లుల్లో పని చేస్తున్న హమాలీలకు బుధవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతున్న వారికి మందులు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమావత్ శంకర్ సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కమల, ఏఎన్‌ఎం రాములమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ నళినికాంత్ పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

- ఎంపీడీఓ ఖాజా అజ్గర్ అలీ

తిరుమలగిరి(సాగర్), అక్టోబర్ 18 : మండలంలోని తూటిపేటతండా, రంగుండ్ల, తిరుమలగిరి, కొంపల్లి, బోయగూడెం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ ఖాజా అజ్గర్‌అలీ బుధవారం పరిశీలించారు. కేంద్రంలో ఉన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రంలో వసతులపై ఆరాతీశారు. కార్యక్రమంలో ఎంపీఓ పద్మ, పీఆర్ ఏఈ సైదులు, పంచాయతీ కార్యదర్శి సైదానాయక్ పాల్గొన్నారు.



బోయగూడెంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఖాజా అజ్గర్‌అలీ

## మహేంద్రయువ సేన బైక్ ర్యాలీ

రాజాపేట, అక్టోబర్ 18 : మహేంద్ర యువసేన ఆధ్వర్యంలో బుధవారం రాజాపేట నుంచి యాదగిరిగుట్ట వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ మోత్కుపల్లి జ్యోతీప్రవీణ్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం యాదగిరిగుట్టలో డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీతోనే యువతకు బంగారు భవిష్యత్, ఉంటుందని, సంక్షేమ పథకాలను గడప గడపకూ తీసుకపోయి ఆలేరు బీఆర్‌ఎస్ అభ్యర్థి గొంగిడి సునీతను భారీ మెజార్టీతో గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో మహేంద్ర యువసేన మండలాధ్యక్షుడు బిల్లకుదురు రాజు, బీఆర్‌ఎస్ మహిళాధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ చింతలపూరి భాస్కర్‌రెడ్డి, మదర్ డెయిరీ డైరెక్టర్ చింతలపూరి భాస్కర్‌రెడ్డి, నాయకులు గౌటె లక్ష్మణ్, సందిల భాస్కర్‌గౌడ్, గుర్రం నర్సింహులు, రేగు సిద్ధులు, గంధమల్ల సురేశ్, సిరిపంగ మహేశ్ పాల్గొన్నారు.



కుంకుమార్చన పూజల్లో పాల్గొన్న మహిళలు

## భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన

త్రిపురారం, అక్టోబర్ 18: మండల కేంద్రంలోని శివాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు లక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. సాయంత్రం 108 మంది మహిళలు అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ పూజారి లోకేశ్‌శర్మ 21 రకాల నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి దంపతులు, ఉత్సవాల నిర్వాహకులు ఎల్లయ్యస్వామి, నగిరి వెంకన్న, సైదులు, నర్సారెడ్డి, భక్తులు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.